

గొంతెండుతోంది..!

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో



క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 50 శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. - 8లో

వెబ్‌సైట్‌లో రీవాల్యుయేషన్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఐదో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో గురువారం అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు మార్కులతో కూడిన జాబితాలు అందజేయనున్నారు. మరోవైపు, విద్యార్థులు డిగ్రీ మొదటి సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు, 4వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి బీచ్ ఫెస్టివల్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బారువ బీచ్ వేదికంగా ఈ నెల 3, 4 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 70–80 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని చెప్పారు. గత వారం జరిగిన ఫెస్టివల్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వర్సిటీకి రెండు నెలలు సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి రెండు నెలలు సెలవులు ప్రకటిస్తూ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు సెలవులు అమల్లో ఉంటాయని పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు సెలవులు వర్తిస్తాయని పేర్కొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్ : సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఎస్సై వి.సందీప్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అల్లర్లు, ఘర్షణలు, కుట్రలకు పాల్పడే వారు, పాల్పడే అవకాశాలు ఉన్న వారిపై నిఘాపెట్టాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ సస్పెన్షన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓ బత్తుల మల్లేశ్వరరావుని సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లేశ్వరరావు 2023–24 ఆర్థిక సంవత్సరంలో టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూనే, టెక్కలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో పంచాయతీ నిధులు దుర్వినియోగంలో పాత్ర ఉందంటూ మల్లేశ్వరరావును సస్పెండ్‌చేశారు. ప్రస్తుతం ఎచ్చెర్ల ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న మల్లేశ్వరరావు మార్చి 10 నుంచి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. రెగ్యులర్ ఎంపీడీవో సీపాన హరిహరరావు రెండు నెలల దీర్ఘకాలిక సెలవుపెట్టారు.

కర్రసాము పోటీల్లో ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నరసన్నపేట: ఏలూరులో రాష్ట్ర స్థాయిలో ఏప్రిల్ 30న జరిగిన కర్ర సాము పోటీల్లో నరసన్నపేటలోని కృష్ణా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. 38 మంది ప్రథమ స్థానం, 16 మంది ద్వితీయ స్థానం సాధించారు. ఆలిండియా కర్రసాము ఫెడరేషన్ గుర్తింపు పొందిన ఎస్‌వీఆర్‌కే ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. విజేతలతో పాటు కోచ్ ఆవల చిన్నను పలువురు అభినందించారు.





సర్కారీ ఆస్తులు ప్రైవేటు అంతస్తులు!

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం నగర పాలక సంస్థ ఆస్తులపై కూటమి సర్కారు కన్నుపడింది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదాత్తం చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఉన్న వాటిని కూలగొట్టి, పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్)విధానం పేరిట ప్రైవేటు రంగ సంస్థలకు, వ్యక్తులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పరిధిలో అభివృద్ధి చేయలేమని చేతులెత్తేసి, ప్రైవేటు వ్యక్తులకు పెత్త నం కట్టబెట్టాలని చూస్తోంది. ప్రైవేటుకు చట్టపరమైన అనుమతులు కల్పించడమే పీపీపీ పద్ధతిలో జరగబోయే సిక్కోలు అభివృద్ధిగా చెప్పాలని కూటమి చూస్తోంది. ఇప్పుడిది శ్రీకాకుళం నగరంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

- ప్రభుత్వ ఆస్తులు కూల్చేసి ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కార్పొరేషన్ కార్యాలయం, పొట్టి శ్రీరాముల మార్కెట్‌తో పాటు మరో నాలుగు ఆస్తులు అప్పగింతకు రంగం సిద్ధం
- పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తామంటున్న పాలకులు
- ఇప్పటికే పలువురు వ్యక్తులతో సంప్రదింపులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. అనుమతులే తరువాయి

అధినేత ఆలోచనకు సై..

సంపద సృష్టిస్తాం..అభివృద్ధి చేస్తాం...అని చంద్రబాబు పదే పదే చెబుతుంటే ... ఆయన చేతిలో మంత్రదండం ఏదో ఉందేమో అని ప్రజలు భావించారు. అనుభవం గల నేత ఏదో ఒక్కటి చేస్తారని అంతా నమ్మారు. కానీ,ప్రజలకు ఇప్పుడు తెలుస్తోంది. చంద్రబాబు సంపద సృష్టించడమంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడ మని భావిస్తూ ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో ఇక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు పనిచేస్తున్నారు. తాజాగా శ్రీకాకుళం నగరంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పరిస్థితి అలానే ఉంది.



పొట్టి శ్రీరాముల మార్కెట్

ప్రైవేటు వ్యక్తులే దిక్కు..

'ఎన్నికల ముందు ఎన్నో చెప్పాం. గత ప్రభుత్వం చేసిన దానికంటే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నాం.. కానీ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. ప్రభుత్వ ఖజానాలో డబ్బు లేదని, చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది' అని సినిమా స్టైల్‌లో చంద్రబాబు దగ్గరి నుంచి ఎమ్మెల్యేల వరకు జీవించేస్తున్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేని కారణంగా ప్రస్తుతానికి ఏం చేయలేకపోతున్నామని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో కొంతైనా చేస్తున్నామని.. ఇప్పుడున్న పరిస్థితుల్లో పీపీపీ విధానమే కరెక్ట్ అని చంద్రబాబు అండ్‌కోకు అలవాటైన పాత పద్ధతులను అమలు చేస్తున్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేసే పరిస్థితి లేదని చెబుతూనే ప్రైవేటు రంగ సంస్థలకు ఆ బాధ్యతను అప్పగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమనేది గత చంద్రబాబు పాలనలోనే మొదలైంది. ఇప్పుడది నిధుల కొరత పేరుతో ప్రజల ముందు ఉంచుతున్నారు. ఇప్పుడున్న వాటిని ప్రైవేటు వ్యక్తుల సహకారంతో అభివృద్ధి చేసి, వాటిపై వచ్చే ఆదాయాన్ని వారే అనుభవించేలా స్కెచ్ చేశారు. ఆ ప్రైవేటు వ్యక్తులు ఎవరనేది కూడా వ్యూహాత్మకంగా కూటమి పాలకులు సిద్ధం చేసిన వాళ్లే. డిన్నర్, లంచ్ పేరుతో ప్రైవేటు వ్యక్తులతో పాలకులు సమాలోచనలు కూడా చేశారు. మొత్తానికి అంతా గూడుపుఠాణిగా మారి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదాత్తం చేసి, నీకింత నాకింత అని పంచుకోవడానికి ప్లాన్ చేసినట్టుగా తెలుస్తోంది.

6 ఆస్తులు అప్పగింత..



బాపూజీ కళా మందిరం

శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, పొట్టి శ్రీరాముల మార్కెట్, బాపూజీ కళా మందిర్, పెద్దపాడు చెరువు లోపల స్థలంతో పాటు మరో రెండు కీలక ప్రదేశాల్లోని స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కూటమి సర్కార్ కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ఉన్న వాటిని కూల్చి పీపీపీ విధానంలో అభివృద్ధి చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ ప్రైవేటు వ్యక్తులే పొందేలా ప్లాన్ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ద్వారా ప్రభుత్వం ప్రతిపాదనలు కూడా తీసుకుంది. దానిలో భాగంగానే పొట్టి శ్రీరాముల మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న వ్యాపారులు ఖాళీ చేయాలని తాఖీదులిచ్చారు. వాస్తవంగా పొట్టి శ్రీరాముల మార్కెట్‌ను గత వైఎస్ జగన్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసింది. మార్కెట్‌లో అడుగు పెట్టాలంటేనే ఇబ్బంది పడే పరిస్థితి నుంచి బయటకు తీసుకొచ్చింది. వరదనీరు, మురుగునీరు నిల్వలేకుండా, పక్కా సీసీ రోడ్లతో సుందరంగా తీర్చిదిద్దింది. కానీ, కూటమి ప్రభుత్వానికి అదేం కనిపించడం లేదు. తమ దారి తమదే అని ప్రైవేటు మోజులో పడింది.

- మున్సిపల్ కార్యాలయాన్ని కూలగొట్టి, ఆ స్థలంలో ప్రైవేటు వ్యక్తులతో నిర్మాణం చేపట్టి, అందులో కొన్ని ఫ్లోర్‌లను మున్సిపల్ కార్యాలయం కోసం, మిగతా ఫ్లోర్‌లను కమర్షియల్ కోసం వినియోగించేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కమర్షియల్ కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయం నిర్మాణం చేపట్టే వ్యక్తులే పొందేలా వ్యూహాత్మక ఒప్పందం చేసుకోవాలని చూస్తోంది. ప్రస్తుతం ఉన్న కార్పొరేషన్ కార్యాలయాన్ని కూలగొడితే... ఉన్న ఫలంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయానికి మార్చాలని కూడా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.
- ఎంతో చరిత్ర గల బాపూజీ కళామందిర్‌తో పాటు మరికొన్ని మున్సిపల్ ఆస్తులు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. చెప్పాలంటే ఆ ఆస్తులను వారికి ధారాదాత్తం చేసినట్టే. వాళ్లు చేసే నిర్మాణాలు చూసి మురిసిపోవడం తప్ప ప్రభుత్వానికి ప్రత్యేకంగా ఒరిగిందేమి ఉండదు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే 'ప్రైవేటు' యాక్షన్ మొదలవుతుంది. తర్వాత ఏమవుతుందో నగర ప్రజలు వేచి చూడాల్సిందే.

● కక్షగట్టి..

ఏడి పింఛెన్



- పండుటాకులపై కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ కక్షసాధింపు
- అకారణంగా పింఛన్ల పంపిణీ నిలిపివేత
- కమలనాభపురం, కోటపాడులో బాధితుల ఆవేదన



కమలనాభపురంలో పింఛన్లు ఆగిపోయిన వృద్ధులు

టెక్కలి/సంతబొమ్మాళి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. తమకు ఓటు వేయని, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఎటువంటి కారణాలు చూపకుండానే పింఛన్ల పంపిణీ అడ్డుకుంటోంది. తాజాగా మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురంలో ఎనిమిది మంది వృద్ధులకు పింఛన్ల పంపిణీ నిలిపివేసింది. గ్రామానికి చెందిన దువ్వారపు అప్పన్న, కర్రి లక్ష్మణ, రోణంకి సింహాచలం, గురువెల్లి గోపాలరావు, కూన సుగ్రీవులు, మొజ్జాడ సూర్యనారాయణ, బొడ్డేపల్లి ధర్మారావు, నెయ్యిల లక్ష్మీనారాయణ అనే ఎనిమిది మంది వృద్ధులకు ఎటువంటి కారణాలు చూపకుండా రెండు నెలలుగా పింఛన్ల పంపిణీ ఆపేశారు.

క్యాన్సర్ బాధితురాలిపై పగ..



లింగుడు ఏకాశి

సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు లింగుడు ఏకాశి అనే వృద్ధురాలికి ఓపీ కోటాలో పింఛన్ అందుతోంది. అయితే తన భర్త రామోజీకి మాజీ సైనిక ఉద్యోగి పేరిట పింఛన్ అందుతోందంటూ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు చాట్ల అప్పలస్వామి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పింఛన్ ఆపేశారని బాధితురాలు గురువారం వాపోయింది. 1987లో తన భర్త స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారని, రూ.10 వేలు లోపు మాత్రమే పింఛను అందేదని, అధికారులకు లిఖిత పూర్వకంగా గత నెలలోనే సమాధానం చెప్పామని, దీంతో ఎంపీడీవో జయంతిప్రసాద్ ఫిబ్రవరి, మార్చి నెలల పింఛన్‌ను ఒకేసారి గత నెలలో ఇచ్చారని పేర్కొంది. ఇప్పుడు రాజకీయ కక్షతో ఎటువంటి నోటీసు ఇవ్వకుండా మే నెల పింఛన్ ఆపేశారని వాపోయింది. తన భర్త ఇటీవలే చనిపోయారని, ఈ పరిస్థితిలో పింఛన్ కూడా ఆపేయడం తగదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ పద్మజ వద్ద ప్రస్తావించగా, ప్రభుత్వం నుంచి పింఛను ఇస్తున్నారని ఫిర్యాదు రావడంతో నిలుపుదల చేసినట్లు తెలిపారు.





వణికిన సిక్కోలు



డే అండ్ నైట్ ప్రాంతంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు

శ్రీకాకుళం: ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. జిల్లా కేంద్రంతో పాటు శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస, నరసన్నపేట తదితర ప్రాంతాల్లో గురువారం రాత్రి గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోజంతా ఉక్కపోతగా ఉన్నా రాత్రి అనూహ్యంగా వాతావరణం మారి ఒక్కసారిగా ఈదురుగాలులు మొదలయ్యాయి. అనేకచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. హోర్డింగులు కూడా విరిగిపోయాయి. పలుచోట్ల ఇళ్లు, వ్యాపార సంస్థల పైకప్పులు, రేకులు ఎగిరిపోయాయి. గాలుల ధాటికి రాత్రి 10 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలుల బీభత్సం అనంతరం ఉరుములు, మెరుపులతో వర్షం మొదలు కావడంతో విద్యుత్ పునరుద్ధరణ పనులు, ఇతర సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. కలెక్టర్ కార్యాలయం నుంచి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో వారంతా వర్షం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడిన చెట్టుకొమ్మలు, హోర్డింగులు
- రాత్రి 10 గంటల నుంచి నిలిచిన విద్యుత్ సరఫరా
- భారీ వర్షంతో సహాయక చర్యలకు అంతరాయం

● కదిలిన కార్మిక లోకం

కార్మిక లోకం కదిలింది. మేడే సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా పరిశ్రమలు, యూనియన్ కార్యాలయాల వద్ద కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్మికులు, నాయకులు కలిసి అరుణ పతాకాలు ఆవిష్కరించారు. కార్మిక హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మే డే

– సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం



విధి నిర్వహణలో అలసత్వం తగదు



వాండ్రంగిలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

జి.సిగడాం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం జి.సిగడాం మండలం వాండ్రంగి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. రహదారిపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా ఇంటి సామగ్రి వేస్తే వాహనాలు ఎలా వెళ్తాయని ప్రశ్నించారు. ప్రతిఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ చోళ్ల సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌరీశంకరరావు, సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు బూరాడ శ్రీదేవి, బూరాడ వెంకటరమణ, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈఈలు కుసుమ, సత్యనారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.

అమరావతి కోసం

ఆపసోపాలు

- మోదీ సభకు జనాలు తరలించే బాధ్యత అధికారులకు అప్పగింత
- నియోజకవర్గానికి 500 మంది టార్గెట్
- ప్రతి బస్సుకు వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి కేటాయింపు
- సభకు వెళ్లాక ఫొటోలు పెట్టాలని హుకుం



రణస్థలం: అమరావతి బయలుదేరిన బస్సు వద్ద మండల స్థాయి అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అమరావతి సభ.. అధికారులకు ప్రాణ సంకటంగా మారింది. ప్రధాన మంత్రి మోదీ హాజరయ్యే సభకు ఇక్కడి నుంచి జనసమీకరణ చేసి తీసుకెళ్లారు. జనాల్ని ఒప్పించి తీసుకెళ్లడానికి అధికారులు ఆపసోపాలు పడ్డారు. డ్వాక్రా మహిళలకు, ఉపాధి మేట్‌లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పెద్ద ఎత్తున ఒత్తిడి చేసి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గానికి 500 మందిని సమీకరించాలని మంత్రులు ఆదేశించినా క్షేత్రస్థాయిలో స్పందన లేకపోవడంతో అరకొరగా సమీకరణ చేసి తీసుకెళ్లారు. ఒక్కొక్క బస్సుకు వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శిని కేటాయించారు. బస్సు అమరావతికి చేరుకున్నాక ఫొటోలు తీసి పెట్టాలని హుకుం జారీ చేశారు. ఏమాత్రం తేడా వచ్చినా సంబంధిత వీఆర్‌ఓ, కార్యదర్శులే బాధ్యతని చెప్పారు.

పెద్ద ఎత్తున బస్సుల సేకరణ..

అమరావతి సభకు జనాల్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులనే కాకుండా వివిధ విద్యా సంస్థల ప్రైవేటు బస్సులను వదల్లేదు. ఇప్పటికే జనాల తరలింపు కోసం జిల్లా నుంచి 55 ఆర్టీసీ బస్సులను తీసుకున్నారు. వాటిన్నింటిని అమరావతి చుట్టు పక్కల జిల్లాలకు పంపించేశారు. దీంతో ఆయా రూట్లలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అంచనాలు తలకిందులు..

ఒక్కొక్క మండలం నుంచి మూడేసి బస్సుల్లో జనాల్ని తరలించాలని తొలుత ఆదేశించినా స్పందన కనిపించలేదు. బస్సు ఏర్పాటు చేసినా, భోజనాలు పెట్టినా, దారి ఖర్చులు ఇచ్చినా బయలుదేరలేమని చాలామంది చెప్పడంతో అధికారులు ఖంగుతిన్నారు. చివరి నిమిషంలో ఉపాధి మేట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాలపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా కొందరిని బయలుదేరించారు.

నదుపాయాలపై స్పష్టతేదీ?

జనాల్ని సమీకరించడమే లక్ష్యంగా పెట్టుకుందే తప్ప తీసుకెళ్లే వారికి భోజన, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా జిల్లాకు కేటాయించలేదు. దీంతో తహశీల్దార్లు, ఎంపీడీఓలు తమ జేబుల్లో నుంచి కొంతపెట్టారు. మిగతాది బస్సుల్లో లైజనింగ్ అధికారులుగా వెళ్లిన కార్యదర్శి, వీఆర్‌ఓలు చూసుకోవాలని ఒప్పించారు. గురువారానికి సరిపడా భోజనం, రూ.10 వేలు చొప్పున తహశీల్దార్, ఎంపీడీవోలు ఇచ్చారు. శుక్రవారం పరిస్థితి ఏంటన్నదానిపై స్పష్టత లేదు.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్‌లో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఎమర్జింగ్ మెటిరీయల్స్ ఫర్ టెక్నాలజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం కళాశాలకు చెందిన ఎంబీఏ అధ్యాపకులు కె.వేణుగోపాల్, డి.విష్ణుమూర్తి తదితరులు రాసిన మార్కెటింగ్ స్మాల్ బిజినెస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎ.ఎస్.సంతోష్‌కుమార్, బి.వి.రమణ, డి.శ్రీరాములు, ఎం.వి.రత్నమణి, ఎం.రమణయ్య, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థినులు



ట్రోఫీతో శాలిహుండం కేజీబీవీ విద్యార్థినులు

గార: జాతీయ టార్గెట్ బాల్ జూనియర్ క్రీడా విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జట్టు పాల్గొని గోల్డ్ మెడల్ సాధించగా, ఈ జట్టులో గార మండలం శాలిహుండం కేజీబీవీ విద్యార్థినులు ఆరుగురు ఉన్నారు. ఏప్రిల్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలోని విద్యా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టు పాల్గొంది. ఈ జట్టులో శాలిహుండం కేజీబీవీ విద్యార్థినులు పడపాన మాధవి (పదో తరగతి), బచ్చు కీర్తి (పదో తరగతి), నీలాపు సుస్మిత (పదో తరగతి), పరపతి లావణ్య (పదో తరగతి), కోనారి రజిని (పదో తరగతి), చుక్క గాయత్రి (ఇంటర్)లు పాల్గొన్నారు. పీడీ జె.నాగరత్నం శిక్షణలో వీరంతా క్రీడలో పాల్గొని విజయం సాధించడంపై ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి అభినందించారు.

గార గ్రామంలో విషజ్వరాలు



జ్వర పీడితులకు మందులు అందజేస్తున్న దృశ్యం

గార: మండల కేంద్రం గార గ్రామంలో విషజ్వరాలతో పలువురు బాధపడుతున్నారు. గత కొన్ని రోజులుగా ప్రజలు జ్వరాలతో ఉన్నా ప్రభుత్వ వైద్య సిబ్బంది కనీసం రోగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు ప్రైవేటుగా వైద్యం చేయించుకుంటున్నారు. స్థానిక సిబ్బందికి చెబుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అదే సమయంలో తాగునీటిని పరీక్ష చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకళను కలిసి తెలియజేశామని, ఇంతవరకు పరీక్షలు కూడా జరపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ చేయాలని, రోగాల బారినపడిన ప్రజలకు వైద్యమందించేందుకు తక్షణమే మెడికల్ క్యాంపులు పెట్టాలని కోరుతున్నారు.



వాటర్ ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

గొంతెండుతోంది..!

- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో దాహం కేకలు
- బాహుదాలో నీరు లేకపోవడంతో ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

ఇచ్ఛాపురం:

పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మొదటి మూడు వార్డులు పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బోర్డర్ ప్రాంతాలకు సుమారుగా నాలుగు దశాబ్దాలుగా తాగునీటి కష్టాలు పట్టిపీడిస్తున్నాయి. అలాగే మరో 20 వార్డుల ప్రజలకు గత నెల రోజులుగా తాగునీరు లేకపోవడంతో గొంతెండుతోంది. అయితే మొదటి మూడు ఈ వార్డులకు తాగునీరు అందించడానికి బాహుదా నది నుంచి 2015లో రూ.50 లక్షలతో పైప్‌లైన్లు వేశారు. కానీ అప్పటి ఏఈ బినామీ పేరుతో పైప్‌లైన్ పనులను నాసిరకంగా చేశాడు. దీంతో ట్రయిల్ రన్ చేయగానే పైపులన్నీ పేలిపోయాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ట్రాక్టర్ల ద్వారానే పురపాలక సంఘం తాగునీటిని సరఫరా చేస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్య గురించి గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పాలకసంఘం తీసుకెళ్లింది. దీంతో ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ బ్యాంక్) నిధులతో రూ.58.83 కోట్లను మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు స్థానిక బాహుదానదిలో 30 అడుగుల లోతున మూడు ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నిర్మాణం కూడా పూర్తికావచ్చాయి. అనంతరం ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘంలో జరగాల్సిన పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి. దీంతో సమస్య మరలా మొదటికొచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులను పట్టించుకోవడం లేదు.



నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్‌లను బాగుచేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తీవ్రస్థాయికి తాగునీటి సమస్య

ఇదిలా ఉండగా మున్సిపాలిటీ ప్రజలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రస్థాయికి చేరింది. ఇటువంటి సమస్య రెండు దశాబ్దాల క్రితం మున్సిపాలిటీని వేధించగా అప్పటి పాలకవర్గం, మున్సిపల్ అధికారులు ఒడిశా అధికారులను కలసి బగలట్టి డ్యామ్ నుంచి బాహుదానదికి నీటిని విడుదల చేయాలని కోరారు. ఆ సమయంలో నీటిస్థాయి ఎక్కువగా ఉండడంతో వారు నీటిని విడిచిపెట్టారు. దీంతో అప్పటికి వారం రోజుల్లో నీటి సమస్యకు పరిష్కారం లభించింది.



బాహుదాలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

ముందస్తు చర్యలు శూన్యం

ప్రతీ ఏడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి నెలలో బాహుదా నదిలో మున్సిపల్ ప్రజల తాగునీటి కోసం నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల వద్ద రివర్ బండ్‌ని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడిని అధిగమించేవారు. ప్రస్తుతం ఈ రివర్‌బండ్ నిర్మాణంలో అధికారుల ముందస్తు చర్యలు కొరవడడంతో ఇన్‌ఫిల్ట్రేషన్‌లో నీరు లేకపోవడంతో సమస్యకు ఒక కారణమైంది. దీంతో పాటు నదిలో ఇసుకాసురులు ఇష్టానుసారంగా ఇసుకను దోచేశారు. ఈ కారణంగా నదిలోని భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ప్రస్తుతం నదిలో ఇసుక లేకపోవడంతో నది మొత్తం పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయింది.

నీటిపన్ను రద్దు

ప్రస్తుతం మున్సిపాలిటీలో ఏర్పడ్డ నీటి సమస్య కారణంగా మున్సిపల్ ప్రజలకు మూడు నెలల పాటు నీటి పన్నులు రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వెల్లడించారంటే సమస్య తీవ్రతను అంచనా వేయవచ్చు. స్థానికంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ మూడుసార్లు ఎన్నికైనప్పటికీ ఇక్కడి నీటి సమస్యను పరిష్కరించేందుకు సరైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అందువలన ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు అందించేందుకు కృషి



మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను అధిగమించడానికి ఒడిశాలోని చీకటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యానో సమంతరని కలిసి బగలట్టి డ్యామ్ నుంచి నీటిని విడిచిపెట్టాలని కోరాము. అదేవిధంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఉద్దానం వాటర్ ప్రాజెక్టుని మున్సిపాలిటీ వాటర్ హెడ్‌వర్క్స్‌కి అనుసంధానం చేస్తున్నాం. ఈ పనులు మూడు రోజుల్లో పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలకు నీటిని సరఫరా చేయడానికి కృషి చేస్తున్నాం.

– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

అధికారుల నిర్లక్ష్యంతోనే...



మున్సిపాలిటీలో ఏర్పడిన తాగునీటి సమస్యకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని చెప్పవచ్చు. నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పేరుకుపోయిన బురదను తొలగించాలని కోరితే మున్సిపల్ ఉన్నతాధికారులు సహకరించలేదు. దీంతో ఈ నీటి సమస్య తలెత్తింది. ఈ కారణంగానే ఏప్రిల్ నుంచి జూన్ వరకు మున్సిపల్ ప్రజలకు నీటి పన్నులు రద్దు చేయాలని నిర్ణయించడం జరిగింది.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

గతంలో ఎన్నడూ లేదు



గతంలో ఎన్నడూ లేనివిధంగా మున్సిపాలిటీ ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. సుమారు నెల రోజుల నుంచి నిత్యం నీటికోసం ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. నీటి కోసం ట్యాంక్ వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. నీటిని పట్టుకొనేటప్పుడు మహిళలు గొడవలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కా రం చూపాలి.

– బి.దాలమ్మ, ముడియావీధి, ఇచ్ఛాపురం

ఉద్దానం ప్రాజెక్టుతో అనుసంధానం

గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ద్వారా మున్సిపాలిటీకి తాగునీటిని అందించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం మున్సిపాలిటీలో ఏర్పడిన నీటి సమస్యను అధిగమించడానికి ఉద్దానం వాటర్ ప్రాజెక్టులోని హెడ్‌వర్క్స్ నుంచి మున్సిపాలిటీలో వాటర్ హెడ్‌వర్క్స్‌కి రూ.5 లక్షలతో పైప్‌లైన్‌ని అనుసంధానం చేసి నీటి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు.

స్టైఫండ్‌తో కూడిన శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్ నందు డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. 6 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైనవారికి శిక్షణలో స్టైఫండ్ అందిస్తామన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలన్నారు.

8న సహకార సంఘ ఎన్నికలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గొర్రెలు, మేకలు పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ శ్రీకాకుళం ఎన్నికలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి డాక్టర్ పి.రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడి కార్యాలయంలో ఎన్నికల రూల్ 22(బీ) పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. చేతులు పైకెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారి ప్రకటించిన నోటీసు, ఓటర్ల జాబితా సంయుక్త సంచాలకుల కార్యాలయంలో నోటీసు బోర్డులో పెట్టినట్లు పేర్కొన్నారు. అదేరోజు నామినేషన్ల అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎటువంటి సందేహాలున్నా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నాటుసారాతో పట్టుబడిన వ్యక్తి



పట్టుబడిన వ్యక్తిని చూపిస్తున్న సిబ్బంది

కవిటి: మండలంలోని బంజుపుట్టుగ తోటల్లో గురువారం మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన బంజు శ్యామరావు అనే వ్యక్తిని 100 నాటుసారా ప్యాకెట్లతో పట్టుకున్నామని మొబైల్ టీమ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న నాటుసారా ప్యాకెట్లు, సదరు నిందితుడిని ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి తదుపరి చర్యల నిమిత్తం అప్పగించినట్టు తెలిపారు.

క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో శిక్షణ

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు (సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు) గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శాప్ సూచనలతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 50 శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. 22 క్రీడాంశాల్లో జరుగుతున్న ఈ శిబిరాల వద్దకు క్రీడాకారులు, బాలబాలికలు తరలివస్తున్నారు. దీంతో క్రీడా మైదానాల్లో సందడి వాతావరణం నెలకొంది. క్రీడాకారులు శారీరక ఫిట్‌నెస్‌తోపాటు నిర్దేశిత క్రీడలో సాధన చేపడుతున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సీఈవో పి.సుందరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్న విషయాన్ని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ క్రీడాకారులు తయారయ్యేది,ఓనమాలు దిద్దుకునేది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలతోనేనని తెలిపారు. డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 50 కేంద్రాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామని, అత్యంత ఆదరణ కలిగిన క్రీడాంశాలకు పెద్దపీట వేశామన్నారు. కేంద్రానికి రూ.7 వేలు చొప్పున శాప్ కేటాయించిందన్నారు. 8 ఏళ్లు పైబడిన బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, టీటీ కోచ్ ఎం.మాధురీలత, పీడీలు చల్లా జగదీష్, ఎన్వీ రమణ, జి.అర్జున్‌రెడ్డి, రాజీవ్, పురుషోత్తం, క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, సీనియ ర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



హాజరైన బాలబాలికలు, కోచ్‌లు



మాట్లాడుతున్న సుందరరావు, పక్కనే సాంబమూర్తి, బీవీ రమణ, డీఎస్‌డీవో శ్రీధర్

గాయపడిన వ్యక్తి మృతి



గోవిందరావు(ఫైల్)

నరసన్నపేట: ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొని గాయపడిన తుంగాన గోవిందరావు (48) గురువారం వేకువజామున మృతి చెందారు. బుధవారం ఉదయం ట్రైన్ ఢీకొనడంతో గాయాలపాలైన విషయం తెలిసిందే. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపా రు. కాగా మృతునికి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు మహేష్, కుమార్తె అనితలు ఉన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు



ప్రతిభ కనబర్చిన అభ్యర్థులతో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: యువతకు నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గరుడభద్రలో షైనింగ్ స్టార్ యువజన సంఘం 25వ వార్షికోత్సవంలో భాగంగా రాష్ట్రస్థాయి డీఎస్సీ టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రవ్యాప్తంగా 500 మంది అభ్యర్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో ప్రతిభ పరీక్ష రాశారు. ఈ పోటీ పరీక్షలో కె.స్వప్న (శ్రీకాకుళం) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. కె.భారతి(శ్రీకాకుళం) ద్వితీయ స్థానం, ఎన్.శ్యామల(విజయనగరం) తృతీయ స్థానంతో పాటు మరో ఏడు స్థానాల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను మాజీ మంత్రి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో షైనింగ్ స్టార్ యువజన సంఘ అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, షైనింగ్ స్టార్ యువజన సంఘ కార్యదర్శి జి.నగేష్, గ్రామ సంఘ కార్యదర్శి చెల్లూరి పాపారావు, గాయిత్రి కళాశాల ప్రిన్సిపాల్ షణ్ముఖరావు, జగన్ కోచింగ్ సెంటర్ అధినేత జగన్, గూడ భాస్కరరావు, వై.ధర్మారావు, వై.అప్పారావు, వై.ఆనందరావు, ఎ.దానేష్ పాల్గొన్నారు.

దుకాణాలు సర్దేయండి!

- ఆమదాలవలస రైల్వేస్టేషన్ పరిధిలోని షాపుల నిర్వాహకులకు నోటీసులు
- 15 రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వే అధికారుల ఆదేశం
- రోడ్డున పడతామంటున్న వ్యాపారులు

ఆమదాలవలస రూరల్ :

రైల్వే స్టేషన్ పరిధిలో పలు దుకాణాలు నిర్వహిస్తున్న వారికి రైల్వే అధికారులు షాకిచ్చారు. తక్షణమే ఖాళీ చేయాలంటూ దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వ్యాపారాలు కోల్పోయి రోడ్డున పడతామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రైల్వే స్థలంలో సుమారు 40 సంవత్సరాలుగా రైల్వే అధికారులు గుర్తించిన స్థలంలోనే సుమారు 46 దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. 1980 నుంచి ఈ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అంతే కాకుండా 10 అడుగులు వెడల్పు, 10 అడుగు పొడవున విస్తీర్ణం గల స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి తొలుత రూ.200 చొప్పున ఆక్రమణ పన్ను రైల్వేశాఖకు చెల్లిస్తూ వచ్చేవారు. అయితే ప్రతి మూడు, నాలుగేళ్లకోసారి రైల్వేశాఖ ఆక్రమణ పన్ను పెంచుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ ఆక్రమణ పన్ను ఒక్కో దుకాణానికి రూ.12,000 చొప్పున చెల్లిస్తున్నారు. అయితే ఏం జరిగిందో గానీ నోటీసు అందిన 15 రోజుల్లో దుకాణాలు ఖాళీ చేయాలని రైల్వే అధికారులు ఆదేశించడంతో వ్యాపారులు దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు.



రైల్వేస్టేషన్ సమీపంలో బస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలు



ఆమదాలవలస రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలు ఇవే...

ప్రత్యామ్నాయమేదీ..?

నాలుగు దశాబ్దాలుగా ఇవే దుకాణాల్లో వివిధ వ్యాపారాలు చేసుకొని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఉన్నఫలంగా దుకాణాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసి తమ పొట్ట కొట్టవద్దని వాపోతున్నారు. అర్ధంతరంగా ఖాళీచేయమంటే తాము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు. గతంలో రైల్వే బుకింగ్ కార్యాలయం, ఇతర అభివృద్ధి పనుల కోసం కొన్ని షాపులు తొలగించినప్పటి వారికి ప్రత్యామ్నాయంగా మరో చోట అవకాశం కల్పించారు. తమకు మాత్రం ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీచేసి వెళ్లిపోవాలని ఆదేశించడంపై పలువురు మండిపడుతున్నారు.

అభివృద్ధిపై ప్రభావం..

రైల్వేస్టేషన్ పరిధిలో ఉండే దుకాణాలు ఖాళీచేస్తే వ్యాపారాలు లేక ఆమదాలవలస అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే ఆమదాలవలస సహకార చక్కెర కర్మాగారం మూతపడటంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవటమే కాకుండా మున్సిపాలిటీ రావాల్సిన ఆదాయ వనరులు తగ్గిపోయాయని, ఇప్పుడు షాపులు కూడా తొలగిస్తే అనేక మంది జీవనోపాధి కోల్పోతారని చెబుతున్నారు. మరోవైపు, జిల్లా కేంద్ర రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందిన ఈ స్టేషన్‌కు నిత్యం పెద్ద ఎత్తున ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి తరుణంలో దుకాణాలు తొలగించటం వల్ల ప్రయాణికులు అందక ఇబ్బందులు పడే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దుకాణాలు ఖాళీ చేయాలని రైల్వే అధికారులు జారీ చేసిన నోటీసు పత్రం

కోర్టును ఆశ్రయించనున్న వ్యాపారులు..

అర్ధంతరంగా దుకాణాలు తొలగించటం వల్ల వ్యాపారులతో పాటు ప్రయాణికులు కూడా ఇబ్బంది పడే ప్రమాదం ఉన్నందున కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే రైల్వే అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించక తప్పదని అంటున్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస కోర్టుకు సంబంధించి వివిధ కేసుల్లో రికవరీ అయిన బంగారం, నగదును సొంతానికి వాడుకున్న విషయమై ఒక కానిస్టేబుల్‌పై కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదయ్యింది. సంబంధిత బాధితులకు అందాల్సిన రూ.10 లక్షలు, ఆరు తులాల బంగారం అందకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించగా విషయం బయటపడింది. ఇదే విషయంపై కాశీబుగ్గ పోలీసుస్టేషన్ సీఐ సూర్యనారాయణకు వివరణ కోరగా, అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్‌కు ముందు చేయి భాగం / ఆపరేషన్ తర్వాత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. గార మండలం అచ్చెన్నపాలెంకు చెందిన శిమ్మ నీలకంఠం వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 30న పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కటింగ్ మిషన్ చేయిమీదకు రావడంతో కుడిచేయి భాగం తెగిపోయింది. నరాలు తెగిపోవడం, ఎక్కువగా రక్తస్రావం జరగడంతో పనిచేయలేని స్థితికి వచ్చేసింది. విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రిని సంప్రదిస్తే సుమారు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలుసుకున్నారు. దీంతో వెంటనే రాగోలు జెమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ డాక్టర్ బుల్లి ప్లాస్టిక్ సర్జరీ చేసి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా అరుదైన ఆపరేషన్‌ను ఉచితంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్ చేయడానికి సుమారు 5 గంటల సమయం వెచ్చించినట్లు ఆర్ఎంవో మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళకు గాయాలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని వీకేపేట రోడ్‌లో ఒక ట్రాక్టర్ స్కూటీని ఢీకొనడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం అత్యంత రద్దీగా ఉన్న వీకేపేట రోడ్‌లో రత్తకన్న వైపు నుంచి మార్కెట్ వైపు ఒక వ్యక్తి ట్రాక్టర్‌ని వేగంగా నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించే క్రమంలో ఢీకొన్నాడు. దీంతో స్కూటీ నడుపుతున్న పెద్ద ఆకుల వీధికి చెందిన కిల్లంశెట్టి శరణ్య అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండడం కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ ముకుందరావు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ సవరాశి దుదిష్టిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ముకుందరావు